# ప్రమాదం

[ కథానిక ]

●

= శ్రీ బూర్గుల రంగనాథరావు =

౧

రెండో సంబంధమయినా, మా ఆయనా నేనూ యెంత అన్యోన్యంగా వుంటామో నీకు తెలుసు. పాపం! ఆయన నన్ను యెంతో ప్రేమతో చూస్తారు. నేనూ చాలా యిదిగావుండి ఆయనే నాసర్వస్వమనుకుని ఆదాంపత్యంతో తృప్తిపడుతూ ఈ నాలుగేళ్లూ యెట్లాగో నెట్టుకవచ్చాను. నాకు పిల్లలు కాలేదే అనే చింతతప్ప యింకేకొఱతా జీవితంలో లేదనిపించేది. సవతిపిల్లలనే—ఇంచుమించు నాయీడు వాళ్లు యిద్దరుకొడుకులు—నాపిల్లలుగా చూసుకుంటూ నాకు లేదనే కొఱతను తొలగించుకొని, నిరాశతోనే ఆశను చంపేసుకుని హాయిగా వున్నాను యింతవరకూ. ఆనందంగా వుండి, అందంగా కనపడి, ప్రేమతో సుఖంగా వున్నామని ఒకరినొకరిని మోసగించుకొని మేము తృప్తిపడ్డాము. అంచేతే మాప్రేమ నేధించక ఆనందదాయకంగా వుంది!

ఒకరిమీదే లగ్నం అయి అణగి అంతరిస్తూవుండిన ఆ రెండక్షరాల 'ప్రేమ'శక్తి జానకిరాంను చూసిన తర్వాత మళ్లీ నాలో ఉబికిరావడం నాకే ఆశ్చర్యం కలిగించింది. ఎప్పటినుండో దాగివుండిన కోర్కెలు ఒక్కమారే సైరెన్‌వలె రంకెవేశాయి. ఎండిపోయిన నాహృదయం చిగిర్చి, చలించిపోయింది. ఇంతవరకూ 'ప్రేమ' అంటే నాకు ఒక భౌతికఅవసరమనీ, అంతకన్నా యెక్కువ నేను నోచుకోలేదనీ, అది నాప్రకృతికే విరుద్ధమేమో అనీ యేమేమో నచ్చజెప్పుకునేదాన్ని. కాని జానకి నాజీవితాన్ని తలక్రిందులుచేశాడు. దేన్ని నేను తృణీకరించి వుంటినో దాన్ని నాకు సర్వస్వంగా చేశాడు. దేని విషయం నేను మరచివుంటినో దాన్ని ఒక విషమసమస్యగా నాముందర తీసుకవచ్చాడు. ఇన్నిరోజులనుంచీ అతడు నా జీవితంతోపాటు యెదిగిపోయి నాలో యెక్కడో దాగివున్నట్టు అనిపించింది. నాహృదయం అతనికి పోగొట్టుకున్నాను. ఇదివరకు గడచిన నాజీవితం నాకు తెలియకుండానే గడచిపోయినట్టూ, అది మళ్లీ ఓమారు మొదటినుండీ ప్రారంభమౌతే బావుండునులా కనుపించింది. ప్రణయం (Romance) నాలో చితికిపోలేదనీ, అప్పుడే నేను దాన్నుంచి పూర్తిగా దూరంకాలేదనీ తలుచుకునేసరికి నావళ్లు ఝల్లుమంది. మనసు విచ్చలవిడిగా, నిర్లక్ష్యంగా, 'టాంకు'లకన్నా ఘోరంగా పరుగెత్తడం మొదలెట్టింది. ఒక కొత్త నవయువ్వనుడికోసమై—అందులో జానకిలాంటి విద్యాధికుడూ, ఉత్తముడూ, రూపవంతుడికై – అతని ఓ వాలుచూపు, ఓ చిరునవ్వు, ఓ నిట్టూర్పుకోసమై నేనలా బాధపడగలిగినందుకు సంతోషం పట్టలేకుండా అయ్యాను. ప్రణయం అనుభవించని కోటానుకోట్లనుండి తప్పుకుంటాననే ఆశ కలిగింది. అతని సుముఖత్వం (Response) నాఆశకు అంతు లేకుండా చేసింది. ఆ ఆశాపథంలోనే ఒక మధుర స్వప్నం, ఆనందరేఖ, దివ్యతేజస్సు పొడగట్టింది!!

అతడిని చూడగానే యెన్నో ఆలోచనలు మిషిన్‌గన్‌మరలోవలె నాతలలో తిరిగిపోయాయి!

౨

అసలు మొదటు యిట్లా ప్రారంభమయింది. కొన్నిరోజులపాటుకని నేను మా పుట్టింటికి వెళ్లాను.

అప్పుడే మామేనత్త (రుక్మిణి), ఆమెభర్త జానకీ వచ్చారు. ఆమె నాకంటే చిన్నది. ఇదివర కెప్పుడూ నేను అతడిని చూడలేదు. వాళ్ల పెళ్లికి మేము వెళ్ల లేకపోయాం. జానకికి యిరవై నాలుగేళ్లుంటాయి. అతనికి తన భార్యమీద ప్రేమ వుందో లేదో కాని అతడికీ, ఆమెకూ విచిత్రంగా ముడిపడ్డది.

నేను వెళ్లిన మొదట్లో అతనికి నన్ను చూడాలనీ, నాతో మాట్లాడాలనీ సహజమైన కుతూహలం కలిగి వుంటుంది. కాని నేను కొంత సిగ్గుతో, కొంత కావా లనీ అతనికి వీలుపడనివ్వకపోవడం అతని కుతూహ లాన్ని తీవ్రమైన కోర్కెగా మార్చింది. "ఎంత చదువుకున్నా ఈ ఆడవాళ్లకు మగవాళ్లంటే అంత భయం యెందుకో" అని ఒకసారి నేను వినేట్టు తన భార్యతో అన్నాడు. ఆ మాటలు అంటున్నప్పుడు అతని పెదవుల్లో ఒలికిన చిరునవ్వును నేను యిప్పటికీ మరవలేను. నేను కొంచెం 'ఫీల్' అయ్యాను. జాలి వేసింది. నాపట్టుదల మానుకున్నాను. పోనీ, తనే తాను ధైర్యంగా నాకళ్లలోకి చూడడే! అతని అమాయకత్వంలో యేదో ఆకర్షణ వున్నట్టూ, అతని కళ్లు దేనినో తీవ్రంగా వాంఛిస్తున్నట్టూ కనపడ్డవి. నేనుకూడా యేదో సాకుతో అతన్ని ఓరచూపులతో చూసేదాన్ని. అతడు యేదో తెలివిగా మాట్లాడడం, నవ్వించడం...ఇన్‌డైరెక్టుగా నాతో మాటలు జరిగించే వాడు. అతడు మాట్లాడుతూంటే చెవులూ కళ్లూ అప్ప గించి వినేదాన్ని. నేనూ అందరితోబాటు మామూ లుగా అతనితో మాట్లాడేటందుకు ప్రయత్నించేదాన్ని. ఇదంతా అందరిలోనే జరిగేది ...... ఆలోచించగా కథ చాలాదూరం పోతుందేమోనని మళ్లీ జాగ్రతపడే ప్రయత్నం చేశాను!...... కాని హృదయం ఊరట చెందదు.

ఆ రోజు నేనూ, రుక్మిణీ తాంబూలాలు వేసు కుంటున్నాము. ఇంకెవ్వరూ లేరు అక్కడ. రుక్మిణి ఉన్నట్టుండి "నీకళ్లు నసీంకళ్లవలె వున్నవట. పాట ఖుర్షీదువలె పాడుతావట" అంది.

"ఎవరన్నారు?"

"మీ మామ."

ఎలెక్ట్రిక్ షాక్‌లా తగిలింది ఆ మాట. ఆశ్చర్య సంతోషాలను దాచుకునే తెలివి పోయింది. "ఇంకా యేమన్నాడు?" అని అడిగేసి, యెందుకు అడిగానా అని మళ్లీ విచారిస్తూ, ఆమెచెప్పే మాట లను వినుపించుకోలేదు. కాని ఆమె "ఆర్టిస్ట్, కల్చర్డ్ యింకా యేమేమో యింగ్లీషుమాటల్లో నిన్ను మెచ్చు కోవడం, అవన్నీ నాలో లేవని నన్ను తిట్టడంతో సరిపోయింది నిన్నరాత్రి" అనేసరికి నాకు మతిపోయిన ట్టయింది. ఎంత ఉబ్బిపోయానో నాకే తెలియదు. ఇదివర కెప్పుడూ నాలో అంత అందం కాని, విశేషంకాని వుందని యెవ్వరూ అనలేదు. నేనూ అనుకోలేదు. బహుశః జానకికూడా నమ్మి వుండడు. తన భార్య మళ్లీ నాతో అనాలని అలా అన్నాడేమో అని యిప్పు డనుకుంటాను. కొంత సమయస్ఫూర్తి తెచ్చుకొని, "ఆ! అదంతా వూరికే నిన్ను వుడికించాలని అనివుంటాడు ...... అయితే మొత్తానికి నన్ను తురకదాన్ని చేశాడు" అని కొంత వినయంతో, కొంత హాస్యంతో ఆ ప్రశంసను ఆపే శాను.

ఓరోజు తల దువ్వుకుంటూ జానకి 'పహిలేహి మొహబ్బతు సే' అనే పాట యెంతో హాయిగా పాడాడు. ఆపాటవరుస నేర్చుకోవాలని నాకు యిష్టం కలిగింది. నాకు పాటలమీద యెంత యిష్టమో నీకు తెలుసు గదూ? "మీ ఆయనతోటి ఆపాట పాడించు...చాలా బాగా పాడతారు" అన్నాను ఆమధ్యాన్నం రుక్మి ణితో. తప్పకుండా పాడతా డనీ, నేను మెచ్చుకున్నం దుకు ఉబ్బిపోతాడనీ నాకు తెలుసు. అతడు మెచ్చు కుంటే నేను ఉబ్బిపోలేనూ! దివ్యవిమానంలో యెక్కి నంత గర్వం కలుగుతుంది అతనికి!

సాయంత్రం యేమీ తోచకపోతే వసారాలో వున్న పుస్తకాల బీరువాలో యేదైనా కథలపుస్తకం కోసం చూస్తున్నాను. ఆపక్కగదిలోనే జానకి వున్నాడని నా కెట్లా తెలుసూ? నేను అక్కడ వున్న సంగతి యెట్లా కనిపెట్టాడో కాని గదిలోనుంచి 'పహి లేహి' అనే పాట పాడుతూ, పాటచివరిభాగం వచ్చే సరికి వెలుపలికి వచ్చేశాడు హఠాత్తుగా. అప్పుడు

అక్కడ ఇంకెవరూ లేరు. నేను వెళ్లిపోతే అతడు పాట మానేయడమే కాక నొచ్చుకుంటాడు. కాని వెళ్లిపోదామని నాపాదాలు తొ్రటుపాటు పడుతూండడం అతడు గమనించే వుంటాడు. పాట అయిపోయాక నా దగ్గరకి వచ్చి, "నేను మంచి పుస్తకం తీసి యివ్వనా మీకు?" అన్నాడు. ఆ బహువచనప్రయోగానికి నాకు సిగ్గూ, ఆశ్చర్యం కలిగింది. "నన్నుకూడా ఓమహిళా సభాధ్యక్షురా లనుకున్నాడా" అనిపించింది. 'తీసివ్వ' మన్నట్టుగా ఒక అడుగు పక్కకు జరిగాను. అతడు పుస్తకం వెతుకుతూనే "మీరుకూడా అందరిలాగే అంతగా బెదరడం నాకు విచిత్రంగా కనపడుతోంది" అని నన్నుచూస్తూ యింగ్లీషులో అన్నాడు. ఈమాట నామీద మరిఒక అస్త్రంలా ప: చేసింది. నాశరీరంలోని రక్తమంతా గడ్డకట్టినట్టు అయింది. అతనిముందర యేదో శక్తి నన్ను నగ్నంగా నిలబెట్టినట్టు అయింది. అతని ముంజేతులు దంతపుకత్తుల్లా మిలమిలలాడుతూ రక్తపు పొగలతో నాకు గిలిగింతలు పెడుతోన్నట్టు అయింది. "రొమాన్సు కావాలా, లేక స్త్రీల వ్రతకథలా" అన్నాడు. కళ్లలోని కొంటెతనం ముఖంమీద పడ్డ ఆ నల్లజుట్టుకూడా దాచజాలలేదు. నేను గట్టిగా నవ్వాను...నన్ను అంత గట్టిగా నవ్వించగలిగినందుకు యెంత తృప్తిపడ్డాడో మనసులో ...... ఇంతలో యెవరో వస్తున్న చప్పుడు అయింది. ఇహ నేను వెళ్లిపోతానేమో అనుకుని, తన చేతిలోని 'శశిరేఖ'ను యిచ్చి నాకన్న ముందుగా తానే గదిలోకి వెళ్లి పోయాడు. పుస్తకం యిస్తున్నప్పుడు నావ్రేళ్లను తాకాలని అతను చేసిన ప్రయత్నం నాకు నవ్వు తెప్పించింది. కాని ఆతొందరలో అతను 'ఫీల్' కాలే దనుకుంటాను. నాకుమాత్రం అతని చిటికనవ్రేలులోనుంచి అతని రక్తపు ప్రతిఅణువూ నాలోకి ప్రాకివచ్చినట్టు అయింది. అతని యీ చర్య నాహృదయాన్ని ఒక నిముషంవరకూ కొట్టుకోకుండా చేసింది. వెళ్లుతూ అతడు చిరునవ్వు నవ్వాడేమోకాని నవ్వినట్లు కనిపించుకోలేదు. ఇహ ఆక్షణంనుంచీ నేను నాలుగేళ్లు చిన్నదాన్ని అయినట్టు అనిపించేది నాకు. అచ్చంగా ఓపది హేనేళ్ల అమ్మాయిలా హుషారుగా వుండింది నా శరీరం. నా చేతులూ కాళ్లూ నావి కానట్టే యిటూ అటూ యెగురడం ప్రారంభించాయి. ఆగడియన మాత్రం యేదైనా కేకవేయుటమో, పిచ్చిపనో చేయాలనిపించింది.

అప్పటినుంచీ జానకితో ఒంటిగా మాట్లాడాలనీ, అతడిని యెప్పుడూ చూస్తూవుండాలనే కోరిక నాలో విజృంభించింది. అతని ప్రతిచేష్టా, ప్రతికదలికా, ప్రతిమాటా యేదో కొత్తసందేశము తెస్తూవుండేది. అతని తెలివీ, గుణగణాలూ వేయిరెట్లు యెక్కువగా కనపడ్డవి. నాకు తెలియకుండానే, నాఆజ్ఞ తీసుకోకుండానే నా సర్వశక్తులూ నన్ను అతని వైపు లాక్కువెళ్లేవి. నేను యేమేమి వెకిలిచేష్టలు చేశానో అతడు చెప్పాలి కాని నాకు తెలియవు. కాని నేనుకూడా మామూలుకన్నా యెక్కువ శ్రద్ధ, జాగ్రత తీసుకునేదాన్ని నా మేకప్ లోనూ, నడవడిలోనూ. నా టేస్టు (అభిరుచు) లన్నీ అతడు తెలుసుకోవాలని రుక్మిణిని నేనే బాగా అలంకరించి, అతనికి, మునుపటికన్నా యెంతో అందంగా ఆమెను కనుపడజేసేదాన్ని. ఇరవైనాలుగుగంటలూ అతని గురించిన ఆలోచనలతోనే నా మెదడు నిండివుండేది. ఆ భావాల భారం నాతల భరించేట్లు లేదు. భోజనం చేస్తున్నా, స్నానం చేస్తున్నా, చదివినా, పాడినా - యేపని చేస్తున్నా అతడు నన్ను చూస్తున్నా డనే తెలివి (conscious-ness) దేన్నిగురించి నేను అంత సంతోషంగా వున్నానో నాకే తెలియకుండా చేసింది. అది ఒక అమోఘభావం. అనుభవైకవేద్యం కాని యెట్లా చెప్పగలను నీకు ? కథలు చదువుతూంటే—మన కథలన్నీ యెట్లా వుంటాయో నీకు తెలుసుగా—వాటిలోని ముఖ్యపాత్రల స్థలాల్లో నేనూ, జానకీ వుంటే యెట్లా ప్రవర్తించేవాళ్లమో భావన చేస్తుంటే యెంతో వుత్సాహంగా, ఉద్రేకపూరితం(Thrilling)గా వుండేది....'శశిరేఖ' యిదివర కెప్పుడో చదివాను. కాని ఆ పరిస్థితుల్లో మళ్లీ చదవా లనిపించింది. అయినా సీరియస్ గా చదువజాలకపోయేదాన్ని. ఓ పేజీ చదవడం, పుస్తకం గిరవాటేసి తలగడలో మొహం దూర్చి పగటికలలు కనడం! ... ఇహ రాత్రిళ్లు మరీ అధ్వాన్నంగా వుండేది. రుక్మిణీ, జానకీ గదిలో చేరుకునేసరికి నా ప్రాణాలన్నీ వారిమధ్యే వుండేవి. కాని

రుక్మిణిమీద అసూయమాత్రం యేమీ కలుగలేదు. పాపం! ఆమె చాలా అమాయకురాలు. అయినా అంత 'డల్' గా, అంత 'మెకానికల్' గా, అంత నిరుత్సాహంతో, అంత 'అన్ రొమాంటిక్'గా రుక్మిణి తోటి అతని జీవితం యెంత దుస్సహంగా వున్నదో చూస్తే నామనసు నీరైపోయేది. రుక్మిణిని చూస్తే కూడా నాకు జాలి వేసేది. ఏనాడవా తెలుసుకునే ప్రయత్నం చేయదు. తనవల్ల తన భర్తకు తృప్తి వున్నదీ లేనిదీ కూడా తెలియదు. జీవితమే అసలు ఆమెలేతకళ్లకు యెంతో దాగివున్నట్టున్నది. మా యిద్దరిలో, పైకి యేమీ కనబడకుండా, లోలోపలనే జరుగుతున్న కోలాహలం—బహుశః ఈ రోజువరకూ—ఆమె తెలుసుకోనేలేదు, పాపం. నేనా యిద్దరినీ చూసి వలవలపోయి చెరి ఒకకంట తడిపెట్టేదాన్ని. ఒకోరోజు మూడు నాలుగింటిదాకా కూడా రాత్రిళ్లు నాకు నిద్రపట్టకపోయేది. నన్ను నేను యెంత అణచుకో ప్రయత్నించాననుకున్నావ్? ఒకోసారి యెక్కడా లేని పట్టుదలతో అన్ని ఆలోచనలనూ పారదోలి దేవుడిని ధ్యానించుకునేదాన్ని. మనసు తిప్పుకోడానికి పతివ్రతామతల్లుల చరిత్రలనూ, జాఃకి జ్ఞాపకం చేసిన స్త్రీల వ్రతకథలనూ చదువుకునేదాన్ని. కాని అట్టే రాత్రి దీపం వెలిగించి చదువుతూవుంటే యింట్లో వాళ్లు యేమనుకుంటారో అనే భయంతో పన్నెండు కాగానే దీపం ఆర్పి నిండా ముసుగుతన్ని పడుకోవడం చాలా కష్టంగా వుండేది. నాబుద్ధి నాతలకు అతుక్కుపోయినట్టు అనిపించేది. "ఎందుకొచ్చాడ్రా దేముడా యీవూరికి యిప్పుడు? వచ్చినా ఆయనైనా నాతో వచ్చి వుంటే యింత మనోబాధ వుండేదికాదేమో" అనిపించేది. ఈ జానకి — అసలు ప్రపంచంలో యేవ్యక్తైనా యిట్లా నాజీవితంలో అడ్డంవస్తారనుకోలేదు. ఆయనను తలచుకుంటే యేడుపొచ్చేది. మళ్లీ వెంటనే "ఇంత అసందర్భపు దాంపత్యాలను యెందుకు కూరుస్తాడో దైవం" అనిపించేది. ఘోరమైన ఆలోచనలు తోచేవి. ఏ అవాంతరమైనా జరిగి జానక్కీ, నాకూ వివాహం — పునర్వివాహం — జరుగుతుందా అనిపించేది. నిర్దాక్షిణ్యంగా ఓడను కొట్టుకపోయే తుపానులా నాదురదృష్టం నన్ను పీడిస్తూవున్నట్టు తోచేది. అమాంతంగా జానకిగదిలోకి వెళ్లి అతడిని రుక్మిణిప్రక్కనుండి లేపి నాబాధంతా వెళ్లబోసుకోవాలనుకునేదాన్ని. ఓగంటకోసం మగవాడినైపోయి అప్పుడతడి భావాలు యెలా వుండేవో తెలుసుకోవాలనుకునేదాన్ని. అతడూ లోలోపల బాధపడతాడు కాని ధైర్యంగా యే'స్టెప్'(చర్య)తీసుకోడు. నావలెనే అతడూ బాధపడుతూంటాడని అనుకున్నప్పుడు నావల్ల నేకదా అని గర్వం కలిగేది....."యేమో యింతకూ అతని ప్రేమ వాంఛారహితమైందేమో! యేమో ఆధునిక ప్రేమ జిజ్ఞాసి మాత్రమేనేమో ...... నేనై నేను నాకోరికలను కనపరచుకుంటే తరువాత అతనికి నామీద వున్న ఆ కాస్తగౌరవమూ, సదభిప్రాయమూ పోతుందేమో" అని భయం కలిగేది. అప్పుడనుకునేదాన్ని: శరీరవాంఛల్ని అణచుకొని మోహపిశాచంతో పోరాడి యెంతో కష్టంతో 'శీలం' నిలబెట్టుకుంటే లోకం దాని నేమాత్రమూ గొప్పతనం (Achievement) అనుకోదు. ఒక Negative Virtue (అసహజమైనగుణం) అనుకుంటుంది. ఆ బాధకూ, ఆ త్యాగానికీ, ఆ విజయానికీ యేమీ క్రెడిట్ (విలువ) యివ్వదు. "కూనీచేయకపోవడం కూడా ఒక పెద్ద ఘనకార్యమా" అనేస్తుంది......బాగా ఆలోచిస్తే నాకు సౌఖ్యం యెక్కడా లేదేమో అనీ, నేను పంజరంలోని చిలకలాగ ఈ చెరలో బంధింపబడి, యితరుల సౌఖ్యాలను చూస్తూ కాలం వెళ్లబుచ్చాలని దేవుడు నానుదుట వ్రాశాడేమోననీ అనుకునేదాన్ని. కాని మళ్లీ వెంటనే యేదోశక్తి "నీభర్త నీమెడ కొక బండవలె వున్నాడు. దానితో నీజీవితం దినదినమూ క్రుంగిపోతోంది" అని అరచినట్టనిపించేది.

## 3

ఆ రోజు వచ్చింది. అమావాస్యతరువాత మూడోరోజో నాలుగోరోజో అనుకుంటాను! రాత్రి సుమారు ఒంటిగంట అయివుంటుంది. దెబ్బలాట తర్వాత నవ్వుమొహంతో వచ్చే ప్రియుడిలా చంద్రుడు పైకివస్తున్నాడు. కిటికీలోనుంచి పెరట్లోని అరటిఆకులు చల్లగాలిని పంపిస్తున్నాయి. నాలుగునక్షత్రాలు-

అందులో రెండు చాలా ప్రకాశవంతంగా వున్నాయి-కూడా కిటికీలోనుంచే కనపడ్డాయి మేడమీద పడుకున్న రుక్మిణీజానకీల కళ్లవలె. వెన్నెల సరీగా వచ్చి నాకాళ్లమీద పడుతున్నది పైకి వెళ్లమని బ్రతిమాలుతున్నట్టు! యెవరన్నా లేస్తే నేను మొరిగి తెలియజేస్తానన్నట్లు మావాళ్ల కుక్క తన రెండుకాళ్లమీదా తల ఆనించి దీనంగా చూస్తోంది...ఇంతలో పైనుంచి జానకిపాట—రేడియోలో వినవచ్చినట్లు! ఆకంఠంలో మాధుర్యంమాత్రమే వినవచ్చింది కాని శబ్దాలు జ్ఞాపకంలేవు. ఇదివర కెప్పుడూ అతనలా పాడివుండడు. జలజలమంటూ వచ్చి కాళ్లకింది మట్టిని తోసి, లాక్కుపోయే మృదుతరంగాలవలె వినవస్తున్నవి ఆపాట సుడులు. నాకోసం కాకపోతే యింకెవరికోసం ఆపాట? రుక్మిణి విని ఆనందించినా తన్మయురాలు కాజాలదు. అంత ఉద్రేకపూరితం (Emotional) గా ఆమెముందర పాడగలడా?

ఇంక నాలోని సర్వశక్తులూ ఒక్కమారు చచ్చిపోయాయి. ఒకే నిశ్చయం కలిగింది. ఎలాగైనా ఆరాత్రి దాటితే మరునాడు ఆవూరినుండీ - జానకినుండీ వెళ్లిపోవాలని నిశ్చయించుకున్నాను. అన్నికోర్కెలూ, అంత ఉద్రేకమూ (Sensation) హఠాత్తుగా తిరుగబడిపోయాయి. "ఈ ఒక్కరాత్రీ నిగ్రహంతో నన్ను నేను అణచుకొని బయటపడితే నేను యెంతో ధన్యురాలిని. మరి యింకొక్కదినంకూడా-ముఖ్యంగా రాత్రి - వుండడం దుస్సహం" అనిపించింది. మావాళ్లు అంత త్వరగా వెళ్లనివ్వరు కాని యెలాగైనా పట్టుపట్టి వెళ్లాలి! "ఈరాత్రి తప్పించుకున్నానంటే నానిగ్రహానికీ, శీలానికీ నేనే యెంత సంతోషిస్తానో! జీవితమంతా ఆగర్వంతో గడపనూ?" అనుకున్నాను.

అంతా గాఢనిద్రలో వున్నారు. పాట సన్నగా పైనుంచి వినవస్తూనేవున్నది. కాని దాని ఆకర్షణ మాధుర్యం అంతా నాకు అర్థరహితంగా అయింది. ఆధ్వని వికారధ్వనివలె కనపడసాగింది. బూతుకూతల్లా కనపడ్డాయి. పాట పూర్తిగా ఆగిపోయింది. ఇహ మూడు గంట లాతే తెల్లవారుతుంది. కళ్లు గట్టిగా మూసుకుని, రేపు యేమిషమీద అంత 'సడెన్'(అకస్మాత్తు)గా వెళ్తానని మావాళ్లకు చెప్పాలో, అట్లా వెళ్తే జానకిమనసు యెట్లా వుంటుందో ఊహించ ప్రయత్నిస్తూ పడుకున్నాను. ఉన్నట్టుండి "రాధా" అనేపిలుపు వినరావడం, యెలెక్ట్రిక్ సూదుల్లా జానకివ్రేళ్లు నా మెడమీద పాకడం ఒకేమారు జరిగింది. లాంతరు సన్నగా ఒకమూలను వెలుగుతున్నది. ఆమసక వెలుగులో అతని మెడ దీనంగా వంగి ప్రార్థిస్తున్నట్లుంది. అతని శ్వాసమాత్రం ఉద్రేకంతో పేలిపోతున్నది. అతడలా వస్తాడనుకోనేలేదు నేను. గడియ క్రిందటి నాఆలోచనలన్నీ యేమయ్యాయో? ఏదో మాట్లాడాలని పెనుగులాడుతున్న అతని పెదవులను మాత్రం నిరీక్షిస్తూ నిశ్చేష్టురాలనైపోయాను. "ఈరాత్రి, ఈవెన్నెల్లో నీవు లేకుండా-దగ్గర వుండికూడా నాకళ్లముందర నాతో మాట్లాడుతూవుండకుండా యెట్లా గడపను? ఈ సౌందర్యం, జీవితములోని అపూర్వపుగడియలు వృథా అవుతున్నాయి...పైకి వెళ్లి మాట్లాడుతూ కూర్చోవచ్చు" అని, ప్రశ్నార్థకంగా నాకళ్లలోకి చూస్తూ నా మెడమీదినుండి చేయి తీశాడు. ఈమాటలు అతడు అన్నాడో, అన్నట్టు నాకనిపించిందో సరిగా చెప్పలేను. విరుద్ధభావాలు నాలో నిండి ఒకటి నొకటి హతమార్చుకొన్నవి. నాతల యుద్ధంతర్వాత కనపడే యుద్ధభూమిగా మారిపోయింది. ఏమీ అనజాలలేదు. కాని ఒక నిట్టూర్పుమాత్రం నన్ను తప్పించుకొని బయటపడ్డది.

"ఇందాకా నీవు మేల్కొని వుంటావని నాకు తెలుసు. ఈరాత్రి హృదయం, యవ్వనం వున్నయేవ్యక్తైనా యిట్లా ఒంటిగా పడుకోజాలదు. నీవూ నావలె బాధపడుతూంటావని తెలుసు. అందులో ఈరోజు వెన్నెల చూస్తే యింకెప్పుడూ యిలాంటి మాధుర్యం దానికి వుండదనిపిస్తున్నది... నీవై నీవు రాలేవని నేనే వచ్చాను"

నేను అప్పుడే అతనితో మేడమీద ఒంటరిగా వున్నట్టు అనిపించింది. "ఇంకా దగ్గరికి తీసుకోడేం, అతని చేతులు నన్ను పైకి యెత్తుకువెళ్తేనేం" అని హృదయంలో సంచలనం బయలుదేరింది. పైన రుక్మిణి

వున్న సంగతి ఓవైపు పెద్ద సమస్య అయి దయ్యంలా తయారయింది.

"రుక్మిణ్ణికూడా లేపుతాను. మనం ముగ్గురం మాట్లాడుకోవచ్చు... పాడుకోవచ్చు హాయిగా" అన్నాడు.

"నీరసంగా వుంది"

"ఏం వంట్లో బావుండలేదూ" అని నా చెంప మీద చెయివేసి చూశాడు ఆదుర్దాగా.

"ఊఁ" అంటే ఆరోజు తప్పిపోయేది. అతడు వెళ్లిపోయేవాడు. కాని అబద్ధం చెప్పి ఆరాత్రిని పోగొట్టుకోవద్దని నానరాలన్నీ యేకంగా అరుస్తున్నాయి. "ఏమీ లేదు" అంటూ కొంచెం తూల్తూ లేచాను. నేననుకున్నంతా అయింది. అతడు నాచేయి పట్టుకొని పైకి తీసికెళ్లాడు.

మెట్లెక్కి వెన్నెట్లోకి వచ్చినాక నామొహం చూశాడు. సంతోషమూ, యిష్టమూ తప్ప వేరే యే భావమూ లేనట్టు నవ్వాను. అతనితో బాగా మాట్లాడాలని నాలుక తొందరపడుతున్నది. ఏమి మాట్లాడాలో మాత్రం తోచక "రుక్మిణి యేదీ" అన్నాను. అదే ప్రథమం యిద్దరమూ యేకాంతంలో స్వేచ్ఛగా కలుసుకోవడం. అతడుమాత్రం నన్ను సరిగా అర్థం చేసుకోలేదని అతని మొహంలోని ద్వైధీభావమే చెప్తున్నది.

"అక్కడ పడుకుని నిద్రపోతోంది...లేపనా?" చాలా జాగ్రతగా అడిగినట్లు అతని కళ్లు సాక్ష్యం చెప్తున్నవి. కాని యీప్రశ్నకు యేం ప్రత్యుత్తరం చెప్పాలో తెలియదు. ఆలస్యం చేస్తే బాగుండదు. "వద్దు" అని త్వరగా అనలేను. "ఊఁ" అనడానికి గొంతు తిరుగబడ్డది...ప్రశ్న వినుపించుకోనట్టు, డాబా మీదకి ప్రాకివచ్చిన మల్లెతీగదగ్గరకు వెళ్లి ఓపూవు కోస్తూ, యేం చెప్పాలో ఆలోచిస్తున్నాను. జవాబుకు మారుగా నేనూ ప్రశ్న వెయ్యడమే మంచి దనిపించింది. అతడూ నావెంటనే వచ్చి మరి ఒక పువ్వును కోశాడు.

"మీరు మాత్రం యింకా నిద్రపోలేదే?" అంటూ కూర్చున్నాను ఆమల్లెతీగదగ్గిర.

"నిద్రపోతే స్వప్నంలో నీవు కనబడతావు. కలలో చూడడంకన్నా ప్రత్యక్షంగా నిన్ను చూడడంలో నాకు యెక్కువ ఆనందం కలుగుతుంది. అంచేత నిద్రపోలేదు. మరి నీవో?" అని అతడూ నా ప్రక్కనే కొంచెం దూరంగా కూర్చున్నాడు.

ఇంత గడుసుగా యిచ్చిన ప్రత్యుత్తరం అర్థమయ్యేసరికి నిముషమయింది.

"ఇంతవరకూ మీరు పాడుతూంటే వింటున్నాను" అన్నాను.

"అయితే నా పాట నీకు నిద్రాభంగం కలిగించింది....అంతేనా?"

రుక్మిణి నిద్రలోనే పక్కకు తిరిగి పడుకుంది.

"మీపాటలు రుక్మిణిని నిద్రపుచ్చ గలిగాయి. నాకు నిద్రాభంగం కావడమేకాక — అసలు నిద్ర పడితేనా భంగ మయేందుకు? — యెప్పుడో దీర్ఘ నిద్ర చెందిన నా కోర్కెలనుగూడా మేల్కొలిపాయి....నిజంగా మీరు చాలా అమోఘంగా పాడారు యిందాకా"

"నీకంటే బాగా పాడతానా?"

"నాపాటను మీరే మెచ్చుకోవాలి!"

"యేం...ఎవరు మెచ్చుకోరు?"

"ఇప్పుడెందు కదంతా...అసలు నాజీవితం ఆగిపోయి యెన్నో యుగాలైనట్టుంది. గమ్యస్థానం కానకుండా పాకిపోతూన్న గుడ్డిపురుగు వలె యీ జీవితాన్ని లాక్కుపోతున్నాను."

ఈమాటలకు అతడు చకితుడైనాడు.

"కాలం అంతగా నీయవ్వనాన్ని వాడుకున్నట్లు లేదు. అందుచేతే నీ వింకా ఆకర్షణీయంగా, అందంగా వుండగలిగావు" అనిమాత్రం ఓదార్చాడు.

నలువైపులనుంచీ మేఘపురెక్కలు చంద్రుణ్ణి కప్పాలని చూస్తున్నాయి. రయ్యిన ఓగాలిపిల్ల నా పమిటను తోసివేయ ప్రయత్నించింది. కొంచెం చలి గూడా వేస్తోంది. పమిట తలమీదినుంచి కప్పుకున్నాను.

"పూర్వం రాజపుత్రస్త్రీలు ఈమోస్తరే కప్పుకునేవారట... చలేస్తోందా?" అన్నాడు. అప్పటికి కూడా అతనిలో యేఉద్రేకమూ దాగిలేదు.

"ఊహూ" అన్నాను. కాని అతడు దగ్గిర కూర్చుని వుండడంవల్ల అతని మాటల తియ్యదనం నన్ను పాతాళానికో, ఆకాశానికో తీసుకువెళ్లుతున్నట్టున్నది. ఎక్కడో బావిలోపడి చస్తున్నవాడి దీనాలాపంలా మనస్సు మారుమూలల్లోనుంచి "నీ నిశ్చయం, నీనిగ్రహం, నీభర్త, అతడు నీలో వుంచిన నమ్మకం యేమయ్యాయి?"అని ఒకచప్పుడు నీరసంగా వినవస్తూన్నది. కాని శరీరంలో ప్రతిగ్రంథీ, ప్రతిఅణువూ జానకి పెదవులను ఆక్రమించుకోవాలని ముందుకు తోసుకవస్తున్నాయి. ఈబాధ అతనికి యెట్లా తెలియజేయాలో నాకు తోచింది కాదు. మామూలువాళ్లకు ఏమీ లేనిచోట యెంతో అర్థం కనపడుతుంది. ఇతడు నాబాధను తెలుసుకోనేవుంటాడు కాని యేమీ ప్రోత్సహించకుండా, పైగా నిరుత్సాహకరమైన చూపుతో యేదో చెప్పాలని ప్రయత్నిస్తున్నట్టు వున్నాడు.

"నిద్రవస్తున్నదా?...వెళ్లిపడుకో" అన్నాడు. ఈమాటలు అంటూ అతడు లేవ ప్రయత్నించి వుండకపోతే, అతడు అన్నాడని నమ్మివుండేదాన్ని కాను. "నేను రేపు వెళ్లిపోతున్నాను మా వూరికి" అన్నాను. నాకళ్లలోని విచారాన్నీ, పెదవుల్లోనితొట్రుపాటునూ, ధ్వనిలోని నిశ్చయాన్నీ అతడు నమ్మకుండా వుండలేకపోయాడు.

"ఏం? ఎందుకంత త్వరగా..."

"లాభం లేదు. తప్పకుండా వెళ్లాలి" అన్నాను. నాకు తెలియకుండానే కళ్లలోనుంచి నీటి చుక్కలు దుమికాయి. కాని మనస్సుమాత్రం నిర్మలమైపోతూన్నట్టు తోచింది. ఎందుకైనా జానకిపట్టుదల, నిగ్రహం నా వాంఛల్ని ఓడించడం మంచి దనిపించింది. తప్పిన తోవనుండి సరియైన తోవ కనపడేముందు కలిగే థ్రిల్ (గగుర్పాటు) అప్పుడే కలుగుతున్నది...వెళ్లిపోవాలని లేచాను...ఇంతలో అతడు నాకళ్ల నీళ్లను తప్పు అర్థం చేసుకున్నాడు...అమాంతంగా వచ్చి, "నిన్ను సరిగా అర్థం చేసుకోలేదు." అంటూ ముద్దుపెట్టుకున్నాడు. మళ్లీ నా శరీరం అస్వాధీనంఅయింది. 'స్విమ్మింగ్ పూల్సు' లో జారుడుతిన్నెలమీదనుండి జారుతూ యిహ ఒక అడుగులో నీరు తాకుతుందనగా, పడబోయేముందు, ఆలోచించడానికి టైము వుంటుందా? అప్పుడా నీరులో విష మున్నదని తెలిసినా అందులో పడకమానను. అలాగే యేమీ తోచక,పరవశురాలినై జానకి చేతుల్లో ఒదిగిపోయాను. రుక్మిణి దగ్గుచప్పుడు వినరాగానే నాకు హఠాత్తుగా ఆమె అక్కడే పడుకున్న సంగతి జ్ఞాపకం వచ్చింది. ఏ పాపమూ యెరుగని ఆమె మూసినకళ్లు వెన్నెల్లో కలువరేకులవలె సౌమ్యంగా వున్నాయి. మాకళ్లు ఆకలితో ఒకళ్లొకటిని కరుచుకుంటున్నాయి! "రుక్మిణి లేస్తుంది" అంటూ జానకిని తప్పించుకుని మెట్లవైపు వచ్చాను. అక్కడికీ, ఆమె పడుకున్న చోటికీ పిట్టగోడే అడ్డం. కాని మెట్లను చూడగానే తప్పించుకుని పోయే చివరి అవకాశం ఆహ్వానిస్తూ కనపడ్డది. ఇంతలో జానకి నా వెనకకి వచ్చాడు. కాని నేను అప్పుడే సగం మెట్లు దిగిపోయాను. దిగానో దూకానోకూడా తెలియలేదు. కాని చివరకు జానకితో యేమీ చెప్పకుండా వెళ్లడం మంచిదికాదనుకుని, "ఇన్నిరోజులూ యేలాగో గడచిపోయాయి. ఇంక ఒక్క గంటకోసం జీవితంలో శాశ్వతంగా బాధపెట్టే గాయం యెందుకు చేసుకోవాలి? మీ మొదటి నిశ్చయం, నిగ్రహం జ్ఞాపకం తెచ్చుకోండి. నాకూ తెలివి వచ్చింది. ఇలా వుంటే చాలు మన ప్రేమ" అని క్రిందికి వచ్చేసి మెట్లతలుపులు పెట్టాను...

మరునాడు యెలాగో ప్రయాణం సాగించాను. బండిలో కూచున్నాక తలుపుదాకా వచ్చిన జానకి అశ్రుపూరితనయనాలు చూసి దుఃఖం పట్టలేకపోయాను. గుమ్మం దాటగానే దోవంటా గంటసేపుదాకా నాకన్నీరు ఆగలేదు.